## క్లుప్తంగా

### సరుకుడు చెట్లు, మామిడి కాపు వేలం



వేలం నిర్వహిస్తున్న డీహెచ్ఎస్ఓ అనిత

బెల్లంపల్లి: మండలంలోని కన్నాల ఉద్యాన నర్సరీలోని సరుకుడు చెట్లు, మామిడి తోట కాపుకు బుధవారం జిల్లా ఉద్యానవన శాఖ అధికారి అనిత ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించారు. సరుకుడు చెట్లను గుత్తేదారు శ్రీనివాస్ రూ.2,03,000లకు దక్కించుకోగా, మామిడి కాపును రూ.53వేలకు వ్యాపారి బాబా కైవసం చేసుకున్నట్లు ఉద్యాన అధికారులు ప్రకటించారు. కార్యక్రమంలో మండల ఉద్యానశాఖ అధికారులు అర్చన, తిరుపతి, వ్యవసాయ అధికారి ప్రేమ్‌కుమార్, అటవీ అధికారి రాథోడ్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

### 'భూముల వేలం నిలిపివేయాలి'

మంచిర్యాలఅర్బన్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వేలాన్ని ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని పీడీఎస్‌యూ, ఏఐఎస్‌బీ, యూఎస్ఎఫ్ఐ నాయకులు శ్రీకాంత్, సన్నీగౌడ్, తిరుపతి డిమాండ్ చేశారు. విద్యార్థులపై పెట్టిన అక్రమ కేసులను వెనక్కి తీసుకోవాలన్నారు. ప్రజాపాలన చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, న్యాయం గురించి గళం విప్పే గొంతుకలపై కత్తులు పెట్టి అణచివేసే ప్రయత్నాలు చేస్తుందని ఆరోపించారు.

### ఘనంగా జాతీయ ఈఎంటీ దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న సిబ్బంది

మంచిర్యాలటౌన్: జాతీయ ఈఎంటీ దినోత్సవాన్ని మంచిర్యాల 108 జిల్లా కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల 108 వాహనాల ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్, జిల్లా 108 వాహనాల కార్యనిర్వహణ అధికారి సంపత్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు.

### ప్రజాపాలన సేవా కేంద్రంలో సమర్పించండి

మందమర్రిరూరల్: రాజీవ్ యువ వికాసం పథకం కోసం దరఖాస్తు చేసుకున్న వారు దరఖాస్తులను మున్సిపాలిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రంలో సమర్పించాలని మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14వ తేదీ లోపు కార్యాలయ పని వేళల్లో సిబ్బందికి అప్పగించాలన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం ఈ నెల 14వరకు గడువు పెంచిందని, అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

### యూత్ జిల్లా అధ్యక్షుడిగా సదానందం



శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లోని ఎయిమ్స్ హైస్కూల్లో బుధవారం తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం యువజన విభాగం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా బింగి సదానందంను ఎన్నుకున్నారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎస్సీ కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం. కమలాకర్, ప్రధాన కార్యదర్శి జే. నర్సింగ్ హాజరయ్యారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు టీ. రాజు, నియోజకవర్గం అధ్యక్షుడు జీ. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### గుడ్ గవర్నెన్స్ యాత్రలో పాల్గొన్న సుమంత్



మంచిర్యాలటౌన్: రాష్ట్ర పబ్లిక్ లీడర్‌షిప్ సంస్థ ఆధ్వర్యంలో ఉత్తర్‌ప్రదేశ్‌లో నిర్వహించిన గుడ్ గవర్నెన్స్ యాత్రకు మంచిర్యాల పట్టణంలోని అశోక్‌రోడ్డుకు చెందిన పెండెం సుమంత్ ఎంపికై విజయవంతంగా పూర్తిచేసుకున్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పీజీ చదువుతున్న సుమంత్‌తో పాటు రాష్ట్రానికి చెందిన మరో విద్యార్థి ఈ యాత్రకు ఎంపిక కాగా, తొమ్మిది రోజుల పాటు ఉత్తరప్రదేశ్‌లో పరిపాలన, శాంతిభద్రతలపై విశేష అధ్యయనం నిర్వహించారు. మంత్రులు, ఐఏఎస్ అధికారులతో పాటు, ఆ రాష్ట్ర భద్రతా విధానాలు, ఆర్థిక ప్రగతి, ఆధ్యాత్మిక ప్రదేశాల నిర్వహణలపై పరిశోధన చేశారు.

### తీగలు వేలాడుతున్నయ్



మందమర్రిరూరల్: మందమర్రి మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో విద్యుత్ తీగలు కిందికి వేలాడి ప్రమాదకరంగా ఉన్నాయి. ఇళ్లకు సమీపంలోని ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని ప్రజలు జంకుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తీగలు సరిచేయాలని కోరుతున్నారు.

### వంగిన విద్యుత్ స్తంభం



మంచిర్యాలటౌన్: పట్టణంలోని గ్రీన్‌సిటీ కాలనీలో రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన స్తంభం ఒక పక్కకు వంగి ప్రమాదకరంగా ఉంది. నిత్యం వందలాది ప్రజలు ఈ రోడ్డు గుండా రాకపోకలు సాగిస్తున్నారు. అయితే వంగిన స్తంభం ఎప్పుడు కింద పడుతుందోనని భయం భయంగా ప్రజలు వెళ్తున్నారు. ఆ స్తంభాన్ని తొలగించేలా చూడాలని కాలనీప్రజలు కోరుతున్నారు.

### నిలువెత్తు ప్రమాదం



వేమనపల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వెనుకాల విద్యుత్ లైన్‌కు ప్రమాదకరంగా గజ్జి తీగలు అల్లుకుపోయాయి. కింద మురికి నీటి ప్రవాహం పెన్సింగ్ తీగ ఉండటంతో విద్యుత్ ప్రమా దం జరిగే అవకాశాలు ఉన్నాయి. రైతులు పంట పొలాలకు వెళ్లే దారికావడంతో నిత్యం రాకపోకలు ఎ క్కువగా ఉంటాయి. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి స్తంభాన్ని సరిచేయాలని రైతులు కోరుతున్నారు.

### మిషన్ భగీరథ నీటిలో పురుగులు



నీటిలో పురుగులు

భీమిని: మిషన్ భగిరథ నీటిలో పురుగులు వస్తున్నాయని మండలంలోని మామిడిగూడ గ్రామస్తులు బుధవారం తెలిపారు. గత నెల 28న మిషన్ భగీరథ నీరు తాగాలని, చెలిమె నీరు తాగొద్దు అని అధికారులు అవగాహన కల్పించారు. ట్యాంక్‌లను శుభ్రపరిచి మంచినీటిని అందించాలని పంచాయతీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ మిషన్ భగిరథ నీటిలో పురుగులు రావడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మిషన్ భగిరథ నీటిట్యాంక్‌ను సరిగా శుభ్రపర్చలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నీటి ట్యాంక్‌ను శుభ్రపరిచి సురక్షిత మంచినీటిని సరఫరా చేయాలని కోరుతున్నారు.

# అనుమతి గండం!

- గడువు ముగిసిందంటూ పారిశుద్ధ్య సిబ్బంది తొలగింపు
- సీడీఎంఏ అనుమతిస్తేనే మళ్లీ విధుల్లోకి..
- పట్టణ పరిధిలో పేరుకుపోతున్న చెత్తాచెదారం



పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్న సిబ్బంది

నస్పూర్: మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిదిలో గత నస్పూర్ మున్సిపల్ నుంచి తాత్కాలిక పద్ధతిలో విధులు నిర్వర్తిస్తున్న సుమారు 121మంది సిబ్బందిని ఈ నెల 1 నుంచి విధుల్లోకి తీసుకోవడం లేదు. అధికారులను ప్రశ్నిస్తే ఒప్పందం మార్చి 31తో ముగిసిందని, సీడీఎంఏ అనుమతి ఇస్తే తిరిగి విధుల్లోకి తీసుకుంటామని అధికారులు బదులిస్తున్నారని పలువురు కార్మికులు వాపోతున్నారు.

**మున్సిపల్ పాలకవర్గం అనుమతితో...**

నస్పూర్ మున్సిపాలిటీగా ఏర్పడిన తరువాత సిబ్బంది కొరత కారణంగా మున్సిపల్ కౌన్సిల్ ఆమోదంతో విడతల వారీగా సుమారు 121మందిని తాత్కాలిక, ఔట్ సోర్సింగ్, ఎంగేజ్‌డ్ పద్ధతిన విధుల్లోకి తీసుకున్నారు. శానిటేషన్, వాటర్ సప్లై, తదితర విభాగాల్లో విధులు నిర్వహిస్తుండగా, పట్టణ ప్రగతి నిధుల నుంచి జీతాలు చెల్లిస్తూ వస్తున్నారు. పట్టణ ప్రగతి నిధులు నిలిపి వేసిన తరువాత మున్సిపల్ జనరల్ ఫండ్, ఫైనాన్స్ కమిషన్ నిధుల నుంచి జీతాలు చెల్లిస్తూ వస్తున్నారు. మంచిర్యాలను కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ చేయడం అందులో నస్పూర్ మున్సిపాలిటీని విలీనం చేయడం తెలిసిందే. మున్సిపాలిటీని మంచిర్యాల కార్పొరేషన్‌లో విలీనం చేసిన నాటి నుంచి జీతాలు రాక ఆందోళన చెందుతున్న కార్మికులకు, విధుల నుంచి తొలగించడం తీవ్ర మానసిక ఆందోళనకు గురిచేస్తోంది. సిబ్బంది నియామకంలో కూడా భారీగా డబ్బులు చేతులు మారాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయమై మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శివాజీని వివరణ కోసం సంప్రదించగా ... ఒప్పంద కార్మికులకు సంబంధించిన ఫైనాన్షియల్ ఇయర్ పూర్తి కావడంతో నిబంధనల మేరకు వారి విధులను నిలిపివేశాం. మళ్లీ ప్రభుత్వం నుంచి అనుమతులు వస్తే పరిశీలించి తీసుకుంటామన్నారు.

**చెత్త సేకరణలో ఇబ్బందులు...**

విధుల్లోకి తీసుకోని కార్మికుల్లో అధికంగా పారిశుద్ధ్య విభాగంలో విధులు నిర్వహించేవారు ఉండడంతో, కార్మికుల గైర్హాజరుతో పట్టణంలో చెత్త సేకరణలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. చెత్త తరలింపునకు నస్పూర్ పరిధిలో మొత్తం 45ట్రాలీలు ఉండగా సిబ్బంది కొరతతో వాటిలో గత రెండు రోజులుగా కేవలం 12వాహనాలు మాత్రమే వినియోగిస్తున్నారు. దీంతో పట్టణంలో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయే ప్రమాదం ఉంది. ఏది ఏమైనా సీడీఎంఏ అనుమతితో ప్రస్తుతం ఉన్న స్టిందిని విధుల్లోకి తీసుకుంటారా.. లేక కొత్త వారిని విధుల్లోకి తీసుకుంటారా అనేది వేచి చూడాలి.

### రేపు అంబేద్కర్ సంఘ సమావేశం

మంచిర్యాలటౌన్: డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ 134వ జయంతి ఉత్సవాల సందర్భంగా ఈ నెల 4వ తేదీన ఉదయం 10గంటలకు జిల్లా కేంద్రంలోని డాక్టర్ నీలకంఠేశ్వర్‌రావు కమ్యూనిటీ హాల్లో సమావేశం నిర్వహించనున్నట్లు అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు రామగిరి శ్రీపతి ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ప్రజాసంఘాలు, దళిత సంఘాల నాయకులు, విద్యావంతులు, మేధావులు హాజరుకావాలని కోరారు.

### కాంగ్రెస్ ఆధ్వర్యంలో జైబాపు, జైభీమ్, జైసంవిధాన్



జిల్లా కేంద్రం నుంచి కాంగ్రెస్ నాయకుల పాదయాత్ర

మంచిర్యాలటౌన్/శ్రీరాంపూర్/దండేపల్లి/లక్సెట్టిపేట/మంచిర్యాలరూరల్(హాజీపూర్): భారతదేశాన్ని కాపాడుకుందాం, రాజ్యాంగాన్ని కాపాడుకుందామంటూ ఏఐసీసీ పిలుపు మేరకు, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ఆదేశాలతో మంచిర్యాల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు స్వాతంత్ర్య భారతదేశాన్ని కాపాడుకుని, రాజ్యాంగాన్ని రక్షించుకుందామంటూ పిలుపునిస్తూ మంచిర్యాల, నస్పూర్, హాజీపూర్, శ్రీరాంపూర్, లక్సెట్టిపేట, దండేపల్లి మండలాల్లో పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### సన్నబియ్యం పంపిణీ



గుడిపేటలో పంపిణీ చేస్తున్న అధికారులు

భీమారం/వేమనపల్లి/భీమిని/మంచిర్యాలరూరల్(హాజీపూర్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పంపిణీ చేస్తున్న సన్నబియ్యం పంపిణీ బుధవారం కొనసాగింది. హాజీపూర్‌లో తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్ పాండే,భీమిని, కన్నెపల్లి మండలాల్లో బెల్లంపల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నర్సింగరావు, తహసీల్దార్ బికర్ణదాస్, భీమారంలో తహసీల్దార్ సదానందం, వేమనపల్లిలో తహసీల్దార్ రమేష్, మాజీ జెడ్పీటీసీ సంతోష్ కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాబీర్‌ఆలీ పేదలకు సన్న బియ్యం పంపిణీ చేశారు.

### అటెన్షన్ ప్లీజ్.. జీపీ ట్రాక్టర్ నిరుపయోగం..!



తాండూర్: మండలంలోని మాదారం శ్రీ ఇంక్‌లైన్ గ్రామపంచాయతీకి చెందిన ట్రాక్టర్ ముందు టైర్ పంక్చర్ అయి రెండు నెలలు దాటినా మరమ్మతులకు నోచుకోవడం లేదు. దీంతో ట్రాక్టర్ నిరుపయోగంగా ఉంటోంది. ట్రాక్టర్ అందుబాటులో లేక చెత్త సేకరణ అంతంత మాత్రంగా జరుగుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే ట్రాక్టర్‌కు మరమ్మతు చేయించి అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

- సంబంధిత అధికారి : తౌఫిక్, పంచాయతీ కార్యదర్శి, మాదారం శ్రీ ఇంక్‌లైన్

- ఫోన్ నంబర్ : 93940 62840

### జాగ్రత్తలు పాటించాలి



మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న అధికారులు

శ్రీరాంపూర్: ఓపెన్ కాస్ట్‌లో ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుందని, వడదెబ్బ తగిలే ప్రమాదం ఉందని, ఉద్యోగులు వేసవి కాలంలో వైద్యులు సూచించిన జాగ్రత్తలు పాటించాలని శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ అధికారి టీ. శ్రీనివాస్ తెలిపారు. ఓపెన్ కాస్ట్ గనిపై సింగరేణి వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వడబెబ్బకు గురికాకుండా వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యులు బుధవారం అవగాహన కల్పించారు. ఏరియా ఆరోగ్యశాఖ అధికారి లోకనాథ్ రెడ్డి మాట్లాడుతూ.. వేసవిలో తలకు టోపీ, కాటన్ దుస్తులు ధరించాలన్నారు. తరుచూ మంచినీళ్లు తాగాలన్నారు. వడదెబ్బకు గురికాకుండా ఉండాలంటే నిమ్మరసం, మజ్జిగ వంటి ద్రావణాలు తీసుకోవాలన్నారు. కంపెనీ అందిస్తున్న ఓఆర్ఎస్ ప్యాకెట్లను వెంట ఉంచుకోవాలన్నారు. ఏమాత్రం నీరసంగా ఉన్న వాటిని సేవించాలన్నారు. ప్రతి సంవత్సరం వేసవిలో ఉద్యోగులకు మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ కార్యక్రమాన్ని ఈ సందర్భంగా అధికారులు ప్రారంభించారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఏరియా సహాయ కార్యదర్శి కొమురయ్య, ప్రాజెక్ట్ ఇంజనీర్ నాగరాజు, ఫిట్ సెక్రెటరీ లచ్చన్న, అధికారుల సంఘం ప్రతినిధి కమ్రుద్దీన్, రక్షణ అధికారి సంపత్, సర్వే అధికారి సంపత్, సంక్షేమ అధికారి బొంగోని శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# మహనీయుల చరిత్ర భావితరాలకు ఆదర్శం

- కలెక్టర్ కుమార్‌దీపక్



సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలటౌన్: దేశ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమించిన మహనుభావుల చరిత్రను భావితరాలకు అందించడంతో పాటు, వారు ఆదర్శంగా ఉండేందుకు తోడ్పడాలని జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో బుధవారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతిని పురస్కరించుకొని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఏ.పురుషోత్తం, జిల్లా అధికారులతో కలిసి హాజరై పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. బానిస ప్రజల సంక్షేమం కోసం, రాజ్యాధికారం కోసం పోరాడిన మహనీయుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని కలెక్టర్ కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు పోటు రవీందర్ రెడ్డి, జిల్లా అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమశాఖ అధికారి నీరటి రాజేశ్వరి, జిల్లా వ్యవసాయాధికారి కల్పన, సాంఘీక సంక్షేమ శాఖ అధికారి దుర్గప్రసాద్ పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: పట్టణానికి చెందిన గౌడ కులస్థుల ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గౌడ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు గండి కుమార్‌గౌడ్, బొమ్మ భూమయ్య, సుదర్శన్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సోమగూడెంలో నినాదాలు చేస్తున్న నాయకులు

కాసిపేట: సోమగూడెం చౌరస్తాలో సర్దార్ పాపన్న గౌడ్ వర్ధంతిని స్థానిక నాయకులు, గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు బైరగోని సిద్ధయ్య, తోడేటి సుధాకర్, కాంగ్రెస్ నాయకులు ముత్తె భూమయ్య, దూడం మహేశ్, తోడేటి కృష్ణ, ప్రశాంత్, స్థానిక నాయకులు తదితరులున్నారు.

జన్నారం: బలహీన వర్గాల ఆశాజ్యోతి వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతిని మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో పాపన్న గౌడ్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. గౌడ సంఘం మండల అధ్యక్షుడు మూల భాస్కర్‌గౌడ్ మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారమే లక్ష్యంగా చివరి వరకు పోరాటం చేసిన యోధుడు పాపన్నగౌడ్ అని కొనియాడారు. సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మోకుదెబ్బ జిల్లా మాజీ అధ్యక్షుడు బాలసాని శ్రీనివాస్ గౌడ్, అంబేడ్కర్ సంఘం మండల అధ్యక్షుడు సిటీమల భరత్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు ఇందయ్య, బీసీ సంఘ జిల్లా నాయకులు కోడూరి చంద్రయ్య, కడార్ల నర్సయ్య, రాగుల శంకర్, సత్తన్న తదితరులు పాల్గొన్నారు.

దండేపల్లి: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతిని దండేపల్లిలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. బస్టాండ్ సమీపంలో పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గౌడ సంఘం మండల అధ్యక్షుడు బండి రవిగౌడ్, పట్టణ అధ్యక్షుడు కుమారస్వామి, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, రవిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.



రామకృష్ణాపూర్: నివాళులర్పిస్తున్న గౌడ కులస్తులు



జన్నారం: నివాళులర్పిస్తున్న నాయకులు



దండేపల్లి: నివాళులర్పిస్తున్న నాయకులు

## సంక్షిప్త వార్తలు

**ఇంటి నంబరు గల్లంతు**

మందమర్రిరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని ఊరు రామకృష్ణాపూర్‌లో రావన వేన సతీష్‌కుమార్‌కు చెందిన ఇంటి నంబరు గల్లంతైంది. 25ఏళ్ల క్రితం ఇల్లు నిర్మించుకోగా అధికారులు 76-339/76 నంబర్ కేటాయించారు. ఏటా ఇంటి పన్ను చెల్లిస్తున్నాడు. 2023-24 ఆర్థిక సంవత్సరం రూ.8,932 చెల్లిస్తే రూ.6,423 రసీదు ఇచ్చి జీరో బిల్లు అయిందని అప్పటి అధికారి చెప్పినట్లు బాధితుడు తెలిపాడు. ఈ ఏడాది పన్ను చెల్లించడానికి కార్యాలయానికి వెళ్లగా ఇంటి నంబర్ లేదని అధికారులు చెప్పడంతో అవాక్కయ్యాడు. ఇంటి నంబర్ ఎగిరిపోయిందని, దరఖాస్తు చేసుకుంటే పరిశీస్తామని చెప్పడం గమనార్హం. అధికారిని సంప్రదించగా.. రికార్డులు పరిశీలిస్తున్నామని తెలిపారు.

**అంబలి పంపిణీ**

భీమిని: కన్నెపల్లి మండల కేంద్రంలో ఉచిత అంబలి పంపిణీ కార్యక్రమాన్ని మాజీ జెడ్పీటీసీ కొటరపు సత్యనారాయణ బుధవారం ప్రారంభించారు. పుల్లూరి తారబాయి-మల్లయ్య జ్ఞాపకార్థంగా వారి కోడలు, కుమారుడు కన్నెపల్లి మాజీ సర్పంచ్ పుల్లూరి సురేఖరాజయ్య ఈ ఉచిత అంబలి పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రామయ్య యాదవ్, బీఆర్ఎస్ నాయకులు శంకర్, రాజయ్య, మహేశ్ గౌడ్, ఎన్న రవి, రాములు, మహేశ్ పాల్గొన్నారు.

**విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభం**

భీమారం: మండలంలోని బూర్గుపల్లిలో నిర్మించిన సేవాలాల్ మహారాజ్ ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు బుధవారం ప్రారంభమాయ్యాయి. మొదటి రోజు బ్రహ్మశ్రీ పూసాల విజయ శర్మ నేతృత్వంలో మహా ఛండీయాగం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ నెల 4న విగ్రహప్రతిష్ఠ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

**షెడ్డు నిర్మాణానికి విరాళం**

దండేపల్లి: మండలంలోని వెల్గనూర్‌లో ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో రేకుల షెడ్డు నిర్మాణానికి గ్రామానికి చెందిన బండారి లక్ష్మి-రాందాస్ దంపతులు రూ.1.20 వేల విరాళాన్ని బుధవారం అందించారు.

**రూ.50వేల ఆర్థిక సాయం**

దండేపల్లి: స్థానిక జెడ్పీ ఉన్నతపాఠశాల 2001-02 ఎస్సెస్సీ బ్యాచ్‌కు చెందిన బాబులాల్ కూతురు వివాహానికి ఆయన బాల్య మిత్రులు రూ.50వేల ఆర్థిక సాయాన్ని బుధవారం అందించారు.